సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం । 3 । సెప్టెంబర్ । 2024



తెలి మంచు.. వాన జల్లు

సాక్షి,పాడేరు: జిల్లా కేంద్రం పాడేరు నుంచి మైదాన ప్రాంతాలకు వెళ్లే ప్రధాన ఘాట్‌రోడ్డులో సోమవారం ఉదయం నుంచి పొగమంచుతో పాటు జల్లులతో కూడిన వాన కురిసింది. మధ్యాహ్నం, సాయంత్రం,రాత్రి సమయంలో ఇదే వాతావరణం ఉంది.పాడేరు ఘాట్‌రోడ్డులో ఈ ఆహ్లాదకర వాతావరణం స్థానికులతో పాటు పర్యాటకులకు కనువిందు చేసింది.మంచు దట్టంగా కురవడంతో వాహన చోదకులు లైట్లు వేసుకుని ప్రయాణించారు.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన రంపచోడవరం సబ్‌కలెక్టర్



కలెక్టర్ దినేష్ కుమార్‌కు మొక్కను అందజేస్తున్న రంపచోడవరం సబ్‌కలెక్టర్ కల్పశ్రీ

సాక్షి, పాడేరు: రంపచోడవరం సబ్‌కలెక్టర్‌గా నియమితులైన కె.ఆర్.కల్పశ్రీ కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు మొక్కతో పాటు తన జాయినింగ్ రిపోర్ట్‌ను కూడా అందజేశారు. ఈసందర్భంగా కలెక్టర్ ఆమెను అభినందించారు.

జాముగుడ ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం సస్పెన్షన్

డుంబ్రిగుడ: మండలంలోని జాముగుడ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాతను సస్పెండ్ చేస్తూ పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఈ సస్పెన్షన్ ఉత్తర్వులను తీసుకోవడానికి హెచ్‌ఎం నిరాకరించారని ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు సోమవారం విలేకరులకు తెలిపారు.

కోలుకుంటున్న విద్యార్థినులు



చికిత్స పొందుతున్న శిరీష, లంద

డుంబ్రిగుడ: మండలంలోని జాముగుడ ఆశ్రమపాఠశాలలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన పలువురు విద్యార్థినులు అరకులోయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం అరకులోయ ఏరియా ఆస్పత్రిలో చేరిన 15 విద్యార్థినులకు వైద్య సిబ్బంది చికిత్స చేస్తున్నారు. శుక్రవారం రాత్రి జాముగుడ ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారం తిని పలువురు ఆస్పత్రిపాలైన విషయం తెలిసిందే. చికిత్స అనంతరం పలువురిని డిశ్చార్జ్ చేయగా, 10 మంది ఆస్పత్రిలో కోలుకుంటున్నారు. 10వ తరగతి చదువుతున్న కొర్ర శిరీష, ముసిరి లంద అనే విద్యార్థినుల పరిస్థితి విషమంగా ఉన్నట్టు ఆస్పత్రి వర్గాల ద్వారా తెలిసింది.

తగ్గిన సోకిలేరు వాగు ఉధృతి

చింతూరు: ప్రజలను ఆందోళనకు గురిచేస్తూ అకస్మాత్తుగా వచ్చిన వరదతో ఆదివారం ఉదయం సోకిలేరు వాగు పొంగి ప్రవహించింది. రెండు మండలాలు, 11 గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. కాగా సోమవారం తెల్లారేసరికి వరదంతా ఒక్కసారిగా మాయమైంది. ప్రస్తుతం రాకపోకలు యథావిధిగా కొనసాగుతున్నాయి.

రోగులతో సీహెచ్‌సీ కిటకిట



సీహెచ్‌సీలో బారులు తీరిన రోగులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సోమవారం రోగులతో కిటకిటలాడింది. సీహెచ్‌సీలో సుమారు 258 పైగా ఓపీ నమోదైంది. గత వారం రోజుల్లో 2 వేలమందికి పైగా రోగులు సీహెచ్‌సీలో వైద్య సేవలు పొందారు. వైద్యాధికారులు గీతాంజలి, సంతోష్, ధరణిలు పరీక్షలు చేసి వైద్య సేవలందించారు.ఆస్పత్రి ప్రాంగణంలో రోగులతో నిండిపోవడంతో పాటు రక్తపరీక్షల గది ఎదుట రోగులు బారులు తీరారు. సీహెచ్‌సీలో ఏడుగురు వైద్యులు ఉండాల్సి ఉండగా కేవలం ముగ్గురు వైద్యాధికారులు మాత్రమే ఉండడంతో రోగులకు ఇబ్బందులు తప్ప లేదు. సీజనల్ వ్యాధులతో రోగులు ఎక్కువగా వచ్చినట్టు ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. కిలగాడ, లబ్బూరు, రూడకోట పీహెచ్‌సీలా పరిధిలో వైద్య సిబ్బంది గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామాల్లో వైద్యాధికారులు, సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు.

నిను మరువలేం రాజన్నా



అరకులోయలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ తనూజరాణి, నేతలు



పాడేరులో డాక్టర్ వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, నేతలు

- వాడవాడలా వైఎస్సార్ వర్ధంతి
- విస్తృతంగా సేవా కార్యక్రమాలు
- రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ

మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డిని జిల్లా ప్రజలు మనసారా స్మరించుకున్నారు. నిను మరువం రాజన్నా అంటూ చిత్రపటానికి, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సంక్షేమ పాలనను గుర్తు చేసుకున్నారు. జోహార్ వైఎస్సార్ అంటూ నినదించారు. సోమవారం నిర్వహించిన వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతి కార్యక్రమాల్లో జిల్లా ప్రజలు, అభిమానులు, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు, అభిమానులు సేవ, వితరణ కార్యక్రమాలు నిర్వహించారు.

అరకులోయటౌన్: గిరిజనుల గుండెల్లో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిరస్థాయిగా నిలిచిపోతారని అరకులోయ ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి అన్నారు. మండల కేంద్రం అరకులోయలో వైఎస్సార్ విగ్రహానికి ఆమె పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భం ఎంపీ మాట్లాడుతూ రాజశేఖర రెడ్డి గిరిజనులకు ఎన్నో సంక్షేమ పథకాలు అందించారన్నారు. అనంతరం అరకు ఏరియా ఆస్పత్రిలో రోగులకు పళ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జామిగుడ వసతి గృహం విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి వైద్యులకు సూచించారు.. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్, అరకులోయ, డుంబ్రిగుడ జెడ్పీటీసీలు, ఎంపీపీలు శెట్టి రోషిణి, చటారి జానకమ్మ, రంజపల్లి ఉషారాణి, బాక ఈశ్వరి, సర్పంచ్‌లు పెట్టెలి సుశ్మిత, గుమ్మ నాగేశ్వరరావు, రాధిక, రమేష్, శారద, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజారమేష్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎల్.బి. కిరణ్, పులివెందుల వేముల మండల మాజీ ఎంపీపీ రామలింగేశ్వరరెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడునర్సింగరావు,ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ మహానేత వైఎస్సార్

పాడేరు: భారతదేశం గర్వించదగ్గ మహానేత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. వైఎస్సార్ 15వ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రమైన పాడేరు పాత బస్టాండ్ వద్ద కాంస్య విగ్రహానికి స్థానిక నాయకులతో కలిసి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్థానిక జిల్లా ఆస్పత్రిలోని మాతా శిశు విభాగంలో గర్భిణులు, బాలింతలకు పాలు,రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు గిరిజన ప్రాంతాలు ఎంతగానో అభివృద్ధి చెందాయని చెప్పారు. పోడు పట్టాలు అందించి భూమిపై ఆదివాసీలకు హక్కు కల్పించారన్నారు. ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహనరెడ్డి తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ గత ఐదేళ్లలో రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కృషి చేశారని చెప్పారు. గిరిజన ప్రాంత ప్రజలంతా వైఎస్సార్‌ను ఎప్పటికీ తమ గుండెల్లో పదిలంగా ఉంచుకుంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు గబ్బాడ చిట్టిబాబు, ఏఎంసీ చైర్మన్ కూతంగి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ సంయుక్త కార్యదర్శి కిల్లు కోటిబాబు నాయుడు, పార్టీ వాణిజ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు డి.పి.రాంబాబు, ఎంపీటీసీలు కుంతూరు నర్సింహమూర్తి, లకే రామకృష్ణపాత్రుడు, ముదిలి సత్యనారాయణ, సర్పంచ్‌లు వంతాల రాంబాబు, గొల్లోరి నీలకంఠం, సోమేలి లక్ష్మణరావు, గల్లేలి లింగమూర్తి, వంతాల నరేష్, ఈశ్వర్ రావు పార్టీ సీనియర్ నాయకులు శరభ సూర్య నారాయణ, పాంగి నాగరాజు, మినుముల కన్నా పాత్రుడు, బోనంగి రమణ, బూర మహేష్, కొర్రా బాలరాజు, కొండబాబు, మాదెల మోహన్‌రావు, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం, డిప్యూటీ వార్డెన్, కమాటీ సస్పెన్షన్

- బంధవీధి బాలికల ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన ఐటీడీఏ పీవో



బంధవీధి ఆశ్రమ పాఠశాలలో విచారణ చేస్తున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

జి.మాడుగుల: మండలంలో బంధవీధి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాల హెచ్‌ఎం కె.సుమిత్ర, డిప్యూటీ వార్డెన్ జానకి, కమాటీ పద్మావతిలను పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ సస్పెండ్ చేశారు. ఈ పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థినులు అదృశ్యమయ్యారన్న సమాచారం తెలుసుకున్న ఆయన ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో పాఠశాలను సందర్శించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన హెచ్‌ఎం, డిప్యూటీ వార్డెన్, కమాటీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్యవేక్షణ లోపంపై డిప్యూటీ డైరెక్టర్ ఐ.కొండలరావు, ఏటీడబ్ల్యూవో తిరుపాల్‌పైన ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతమైతే బాధ్యులపై చర్యలు తప్పవని పీవో తీవ్రంగా హెచ్చరించారు. బాలికల అదృశ్యంతో సంబంధం ఉన్న డుంబ్రిగుడ ఎంపీడీవో కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్ శేషగిరిరావుపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థినులు పాఠశాలను విడిచి బయటకు ఎందుకు వెళ్లారని ఆరా తీశారు. ఈ సంఘటనతో ప్రమేయమున్న భారత్ గ్యాస్ కంపెనీలో పనిచేస్తున్న చిన్నబాబు, గోపిచంద్‌పై విచారణ జరిపి చర్యలుతీసుకోవాలని జి.మాడుగుల ఎస్‌ఐని పీవోఆదేశించారు.గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు,ఏటీడబ్ల్యూవో తిరుపాల్ పాల్గొన్నారు.

మాతా, శిశు మరణాల నివారణే లక్ష్యం

- అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామాలను దత్తత తీసుకోవాలి
- కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు: ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త తాను పనిచేస్తున్న గ్రామాన్ని దత్తత తీసుకుని, మాతాశిశు మరణాల నివారణే లక్ష్యంగా కృషి చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని కాఫీ హౌస్‌లో జాతీయ పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల ఒకటవ తేదీ నుంచి 30వ తేదీ వరకు కార్యక్రమాలు నిర్వహించాల న్నారు. రక్తహీనత, వ్యక్తిగత, సామాజిక పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని, పిల్లల ఎదుగుదలపై దృష్టిసారించాలని, ఆరు నెలలు నిండిన శిశువులకు అదనపు ఆహారాన్ని అందించాలని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రతి వారం తమ పరిధిలోని గర్భిణుల ఇళ్ల వద్దకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవాలని, ప్రతి నెలా విలేజ్ హెల్త్ అండ్ న్యూట్రీషన్ డే నిర్వహించాలని తెలిపారు. గ్రామాల్లో చైల్డ్ మ్యారేజ్ ప్రొటెక్షన్ అండ్ మానిటరింగ్ కమిటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, బాల్య వివాహాలు జరగకుండా చూడాలన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్న ప్రాశనకార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, డీఎంహెచ్‌వో డాక్టర్ జమల్‌బాషా, జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు, డీఎస్‌వో టి.వెంకటేశ్వర్లు, టీడీ ప్రశాంత్, డివిజన్ పరిధిలోని సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

మెనూ సక్రమంగా అమలు చేయకుంటే చర్యలు

ఐటీడీఏ పీవో అపూర్వభరత్



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అపూర్వభరత్

చింతూరు: స్థానిక డివిజన్ పరిధిలోని అన్ని పాఠశాలల్లో మెనూను సక్రమంగా అమలు చేయాలని, లేకపోతే చర్యలు తప్పవని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ హెచ్చరించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల్లోని అన్ని పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలతో ఆయన సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందించాలని ఆదేశించారు. వంటగది, వసతిగృహ పరిసరాలు, వంటపాత్రలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. వండిన ఆహారాన్ని విద్యార్థులతో పాటు ప్రధానోపాధ్యాయులు కూడా భుజించాలని, పాఠశాలల పరిసరాల్లో నీటినిల్వలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని పీవో ఆదేశించారు.

పోషకాహారంపై అవగాహన కల్పించాలి

ప్రతి అంగన్‌వాడీ పరిధిలోని గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించాలని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ సూచించారు. డివిజనల్ స్థాయి పోషణ మాసోత్సవ కార్యక్రమాన్ని సోమవారం ఆయన చింతూరులో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కిశోర బాలికలు, చిన్నారులకు అందించే పోషకాహారం గురించి తల్లులకు వివరించాలని సూచించారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, సీడీపీవో నాగలక్ష్మి, సిబ్బంది ప్రియాంక, వెంకటలక్ష్మి, వనజ, రాధ, రాజు పాల్గొన్నారు.

గండికొత్తగూడెం రహదారి పరిశీలన

కూనవరం: గండికొత్తగూడెం రహదారిని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ సోమవారం పరిశీలించారు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు దెబ్బతిన్న కల్వర్ట్‌కు మరమ్మతుల చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రేపాక కాలనీ నుంచి గండి కొత్తగూడెం వాహనంలో వెళుతుండగా మధ్యలో మార్గం సరిగా లేకపోవడంతో కిలోమీటరు దూరం కాలినడకన వెళ్లి కలవర్టును పరిశీలించారు. గండికొత్త గూడెం రోడ్డు దెబ్బతిన్నందున 108 వాహనం కూడా వచ్చే అవకాశం లేదని వైఎస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, పెదార్కూరు, కూటూరు, లింగాపురం సర్పంచ్‌లు నాగమణి, బొగ్గా వెంకమ్మ, సోడె శంకర్‌లు, ఎంపీటీసీలు అమ్మాజీ, జయసుధలు పీవోకు తెలియజేయడంతో ఆయన ఆ రోడ్డును పరిశీలించారు. అంతకు ముందు రహదారి మధ్యలో తెగిపడి ఉన్న విద్యుత్ వైర్లను గమనించిన పీవో.. వాటిని సరిచేయాలని విద్యుత్ శాఖ సిబ్బందిని ఆదేశించారు.

రోడ్ల మరమ్మతులకు చర్యలు

- అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



రోడ్డును పరిశీలిస్తున్న అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం

అనంతగిరి(అరకులోయ రూరల్): వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటానని అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం తెలిపారు. వర్షాల కారణంగా మండలంలోని కొండిబ పంచాయతీలో దెబ్బతిన్న రోడ్లను సోమవారం ఆయన పరిశీలించారు. వలమామిడి, కపతవలస, అంబటిమామిడి, రజినీగుడ తదితర గ్రామాల్లో పర్యటించి, రోడ్లను పరిశీలించారు. అస్తవ్యస్తంగా తయారైన రోడ్ల కారణంగా ఇబ్బందులు పడుతున్నామని, సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామస్తులు కోరడంతో ఉన్నతాధికారులతో మాట్లాడి మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎంపీపీ నీలవేణి, పార్టీ మండల అధ్యక్షుడు రెడబోయిన స్వామి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పాంగి అప్పారావు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సూర్యనారా యణ, వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించాలని 'మాచ్‌ఖండ్' ఎస్‌ఈకి విజ్ఞప్తి

ముంచంగిపుట్టు: ఆంధ్ర ఒడిశా రాష్ట్రాల ఉమ్మడి నిర్వహణలో ఉన్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం పరిసర ప్రాంతాల్లోని గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని పలు గ్రామాల ప్రజలు సోమవారం మాచ్‌ఖండ్ ప్రాజెక్టు ఎస్‌ఈ ఎ.వి.సుబ్రహ్మణ్యేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. గ్రామాల్లో ఉచిత విద్యుత్,సీఎస్‌ఆర్ నిధులతో పాఠశాలలకు వసతులు, విద్యార్థులకు స్కూల్ బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రాజెక్టులో అర్హులైన వారికి ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేస్తూ ఒనకఢిల్లీ,బద్దిగూడ,చికినిపుట్టు పంచాయతీలకు చెందిన గిరిజనులు వినతి పత్రం అందజేశారు.

అత్తను హతమార్చిన కోడలు



లక్ష్మి మృతదేహం

రాజవొమ్మంగి: వివాహేతర సంబంధాన్ని అంటగడుతోందన్న ఆగ్రహంతో అత్తను దారుణంగా హతమార్చిందో ఓ కోడలు. మండలంలోని కొండపల్లి పంచాయతీ మర్రిపాలెంలో ఈ దారుణం చోటు చేసుకుంది. సీఐ సన్యాసినాయుడు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి.. మర్రిపాలెంలో ఈకా లక్ష్మి (55), తన కొడుకు, కోడలు జ్యోతి, నలుగురు మనుమలతో కలిసి చిన్న పూరిగుడిసెలో నివాసముంటోంది. కొడుకు కూలి పనుల కోసం తరచూ వేరే ప్రాంతాలకు వెళుతుంటాడు. అయితే అత్త లక్ష్మి తనకు తరచూ వివాహేతర సంబంధాలు అంటగడుతోందని, ఆమెకు వచ్చిన పింఛన్ డబ్బులను ఇంట్లో ఇవ్వడం లేదని కోపంతో ఉన్న జ్యోతి ఆదివారం సాయంత్రం కర్రతో ఆమెపై దాడిచేసి హతమార్చిందని సీఐ తెలిపారు. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి అడ్డతీగల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు సీఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందుల్లో కుటుంబం..

బాధిత కుటుంబం ఆర్థికంగా ఎంతో దీనావస్థలో ఉన్నట్టు గ్రామస్తులు తెలిపారు. అత్తను హతమార్చిన జ్యోతికి ఐదుగురు సంతానం. వారంతా 10 సంవత్సరాలలోపు పిల్లలే. వీరిలో ఒకరిని... వేరొకరికి పెంచుకోడానికి ఇచ్చేశారు. కుటుంబమంతా చిన్న తాటాకు పాకలో తలదాచుకొంటోంది. జ్యోతి భర్త పనుల కోసం ఒంగోలుకు వెళ్లగా ఈ దుర్ఘటన జరిగింది.

బావమరిదిపై కత్తితో దాడి

అడ్డతీగల: అక్కని కొట్టవద్దని చెప్పిన బావమరిదిపై బావ కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన సంఘటన సోమవారం చేసుకుంది. ఎస్‌ఐ అప్పలరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మిరియాల దొరబాబు, మంజులత దంపతులు కొంతకాలంగా గురుకుల పాఠశాల సమీపంలో నివసిస్తున్నారు. ఆదివారం రాత్రి దొరబాబుకి అతని భార్య మంజులతకు వాగ్వాదం జరిగి దొరబాబు భార్యను కొట్టాడు. ఈ విషయం మంజులత సోదరుడు సోమరాజుకి తెలిసి అక్కను తరచూ కొడుతున్నావని మానుకోవాలని బావను హెచ్చరించి వెళ్లిపోయాడు. దీంతో కోపోద్రిక్తుడైన దొరబాబు మద్దిగడ్డ రోడ్‌లో ఉన్న సోమరాజుపై కత్తితో దాడి చేశాడు. దీంతో తీవ్రంగా గాయపడిన సోమరాజును స్థానికులు అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైక్‌లు ఢీ - ఇద్దరికి గాయాలు

అడ్డతీగల: మండలంలోని ఉలిగోగుల శివారున సోమవారం రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి.ప్రమాదంలో ఉలిగోగులకు చెందిన పొత్తూరు శ్రీనుబాబు, రాజవొమ్మంగి మండలం చీడిపాలెంకి చెందిన పలక శ్రీను తీవ్రంగా గాయపడ్డారు. వారిని అడ్డతీగల సీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక వైద్యం అనంతరం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. దుశ్చర్తి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

డెంగ్యూతో వ్యవసాయ కూలీ మృతి



రమణ(ఫైల్)

రాజవొమ్మంగి: మండలంలోని లబ్బర్తి గ్రామానికి చెందిన పొడుగు రమణ (35) డెంగ్యూ జ్వరంతో బాధపడుతూ సోమవారం ఇంటి వద్ద మరణించాడు. రమణ జ్వరంతో శనివారం లాగరాయి పీహెచ్‌సీకు వెళ్లాడు. పరీక్ష చేయగా డెంగ్యూ పాజిటివ్ వచ్చిందని, ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కాకినాడ రిఫర్ చేశామని డాక్టర్ ఉషశ్రీ తెలిపారు. కాగా ఇంతలోనే అతను మరణించాడన్నారు. లబ్బర్తిలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరారు.

పోర్‌బే డ్యామ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



పోర్‌బే డ్యామ్‌లో లభ్యమైన మృతదేహం

మోతుగూడెం: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని పోర్‌బేడ్యామ్‌లో ఒక గుర్తు తెలియని వ్యక్తి(40) మృతదేహం సోమవారం లభించినట్టు స్థానిక ఎస్‌ఐ గోపాలరావు తెలిపారు. మృతుడి మెడలో నల్లటి తాడుకు ఒక లాకెట్ ఉందని, దానికి రెండు వైపులా ఏసుక్రీస్తు, మేరీమాత బొమ్మలు ఉన్నట్టు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమారానికి చింతూరు ఏరియా ఆస్పత్రికి తరలించినట్టు చెప్పారు. మృతుడి వివరాలు తెలిస్తే 9492864275 అనే ఫోన్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

తుదిశ్వాస వరకు వైఎస్సార్‌సీపీతోనే..



మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

చింతపల్లి: జగనే నా ప్రాణం..నా ఆఖరి శ్వాస వరకూ వైఎస్సార్‌సీపీతోనే ఉంటానని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన తరువాత తొలిసారిగా చింతపల్లి వచ్చిన విశ్వేశ్వరరాజును పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు మోరి రవి అధ్యక్షతన చింతపల్లి, గూడెం కొత్తవీధి నాయకులతో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. దివంగత నేత డాక్టర్ వైఎస్సార్‌ను, ఆయన తనయుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని గిరిజనులు గుండెల్లో పెట్టుకున్నారన్నారు. పార్టీకి కార్యకర్తలే అండ దండగా ఉండాలన్నారు. ప్రలోభాలకు లొంగి పార్టీలు మారే నాయకులకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. తాను ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీని వీడేది లేదన్నారు. గిరిజనులకు ఏ కష్టమొచ్చినా తాను ముందుంటానన్నారు. ఎంపీపీ అనూషాదేవి, జెడ్పీటీసీ బాలయ్య, వైఎస్ ఎంపీపీ శారద, నాయకుడు జల్లి సుధాకర్, గుణబాబు, సర్పంచ్ పుష్పలత, గూడెంకొత్తవీధి ఎంపీపీ కుమారి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

పోలీసుల పేరుతో అక్రమ వసూళ్లు

విశాఖకు చెందిన ఇద్దరిపై చీటింగ్ కేసు నమోదు



అక్రమ వసూళ్లు చేస్తూ పట్టుబడిన నిందితులు

ముంచంగిపుట్టు: తాము పోలీసులమని, ఫారెస్టు సిబ్బందిమని, మెడికల్ క్యాంప్, అన్నదానం నిర్వహిస్తున్నామని చెబుతూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా... మండలంలోని పలు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి తాము పోలీసులమని కొంత మంది వద్ద, ఫారెస్టు సిబ్బందిమని మరికొంత మంది చెప్పి ఒక్కొక్కరి నుంచి రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు అక్రమంగా వసూలు చేశారు. మరికొంతమంది వద్ద నుంచి స్వచ్ఛంద సంస్థ పేరుతో విరాళాలు వసూలు చేశారు. ముంచంగిపుట్టు మండల కేంద్రానికి వచ్చే వాహనాలను సైతం నిలిపి పోలీసుల పేరుతో భయపెట్టి డబ్బులు గుంజారు.ఆ సమయంలో పెదబయలు వెళ్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర భర్త మూర్తి వాహనాన్ని ఆపి డబ్బులు వసూలు చేసే ప్రయత్నం చేశారు. దీంతో ఆయనకు అనుమానం వచ్చి గట్టిగా నిలదీయడంతో నకిలీ పోలీసులుగా తేలింది. స్థానికుల సాయంతో ముంచంగిపుట్టు పోలీసు స్టేషన్‌లో ఆ ఇద్దరి వ్యక్తులను అప్పగించారు. ఎస్‌ఐ రవీంద్ర విచారణ చేయగా ఈ ఇద్దరూ విశాఖపట్నం లోని ఆరిలోవకు చెందిన బొత్స యువరాజు, మండవల్లి రాజురత్నంగా గుర్తించారు. వీరు వద్ద మానవత్వాన్ని కాపాడండి స్వచ్ఛంద సంస్థ పేరుతో గుర్తింపు కార్డులు, సర్టిఫికెట్లు ఉన్నాయి. వీరిపై చీటింగ్ కేసు నమోదు చేసి, రూ.6వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ రవీంద్ర తెలిపారు.